వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 208 సోమవారం | 19 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# వరంగల్‌కు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

విజయవంతంగా శిక్షణ పూర్తి చేయాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా

2లో..

వివరాలు 2లో..



# తల్లుల చెంతకు చలో..చలో

మేడారం మహా జాతరకు వేళాయే

ఫిబ్రవరి 21నుంచి 24 వరకు

ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం

అందుబాటులో 6వేల బస్సులు

తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతి గడించిన మేడారం మహా జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 21నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు కోటిన్నరకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఈ మేరకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ములుగు జిల్లా కేంద్రం నుంచి 44 కిలోమీటర్ల దూరంలోని తాడ్వాయి మండలంలో దట్టమైన అడవులు, కొండల మధ్య సమ్మక్క-సారలమ్మలు కొలువై ఉన్నారు. అమ్మలకు నిలువెత్తు బంగారం (బెల్లం)తోపాటు చీర, సారే, పసుపు, కుంకుమ, గాజులు ముడుపులుగా కట్టి మొక్కలు చెల్లించుకుంటారు. బెల్లం పానకం, తలనీలాలతోపాటు ఎదురుకోళ్లను సమర్పించుకొని పిల్లా, పాప, పాడిపంటలు, గొడ్డు, గోద చల్లగా ఉండాలంటూ తల్లులను వేడుకుంటూ మొక్కులు చెల్లించుకుంటారు. మహిమాన్విత శక్తులు కలిగిన సమ్మక్క, సారలమ్మలు భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. దీంతో ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య ఏటికేటా పెరిగిపోతున్నారు. వీరిని దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలలోని భక్తులే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

- వరంగల్ వాయిస్, ములుగు



8లో

# జాతరను విజయవంతం చేయాలి

మేడారం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మంత్రి సీతక్కతో కలిసి వనదేవతల సందర్శన

## సిద్దేశ్వరుడికి మోదుగు పూలతో అలంకరణ



హనుమకొండలోని చారిత్రాత్మక సిద్దేశ్వర ఆలయంలో మాఘమాసం సోమవారం సందర్భంగా సిద్దేశ్వర స్వామిని మోదుగు పూలు, తమలపాకులతో అందంగా అలంకరించారు. స్వామికి మహా హారతి అందించి అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ



2లో

## బండారు దత్తాత్రేయను కలిసిన రావు పద్మ

బీజేపీ నేషనల్ కన్వెన్షన్‌కు రవికుమార్



# తల్లుల చెంతకు..
# చలో..చలో



భక్తులు సమర్పించిన చీరలు, కానుకలతో సమ్మక్క, సారలమ్మ దేవతలు

**మేడారం మహా జాతరకు వేళాయే**
**ఫిబ్రవరి 21నుంచి 24 వరకు**
**ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం**
**అందుబాటులో 6వేల బస్సులు**

**వరంగల్ వాయిస్, ములుగు :** విగ్రహాలు లేని విశిష్టమైన జాతర మేడారం మహా జాతర. అడవి తల్లి బిడ్డలకు పట్టం కట్టి ప్రకృతిని పూజించడమే ఈ జాతర ప్రత్యేకం. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సమయం దగ్గరపడుతున్నకొద్ది భక్తుల రద్దీ పెరుగుతోంది. ఇప్పటికే మేడారంలో భక్తజనం పోటెత్తుతున్నారు. మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు భారీగా చేసింది. ఫిబ్రవరి 21 నుండి 24వ తేదీ వరకు జరిగే మహా జాతరకు కోటిన్నర వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రూట్ మ్యాప్ ని సిద్ధం చేయడంతో పాటు, జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను బట్టి అందుకు తగిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. జాతరకు ముందస్తుగానే లక్షలాది మంది తరలివచ్చి వన దేవతలైన సమ్మక్క, సారలమ్మ దివ్య దర్శనం చేసుకొని తరించిపోతున్నారు. మరోవైపు మేడారం వెళ్లేందుకు ఆరు వేల ప్రత్యేక బస్సులను టీఎస్ ఆర్టీసీ ఏర్పాటు చేసింది. 40 లక్షలమంది భక్తులను చేరవేయడమే లక్ష్యంగా రవాణా శాఖ పనిచేస్తోంది. జాతరకు వారం ముందు నుంచే మేడారంలో భక్తుల కోసం 24 గంటల వైద్య సదుపాయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది.

## పోటెత్తుతున్న భక్తులు..

అసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరైన మేడారం మహా జాతరకు భక్తులు పోటోత్తుతున్నారు. సమ్మక్క, సారలమ్మల ఆశీర్వాదాల కోసం లక్షలాదిగా తరలి వస్తున్నారు. జాతర పరిసరాలు భక్తజన సంద్రంగా మారాయి. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేస్తున్నారు. అమ్మవార్ల దర్శనంతో భక్తులు తన్మయత్వం పొందుతున్నారు. అమ్మ వార్లకు నిలువెత్తు బెల్లాన్ని కానుకగా సమర్పిస్తున్నారు. బెల్లం, చీర, సారెలు, ఒడిబియ్య సమర్పించి మొక్కలు చెల్లించుకుంటున్నారు.

## తొలి మొక్కులు గట్టమ్మకే..

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు తప్పనిసరిగా గట్టమ్మను దర్శించుకుంటారు. తొలి మొక్కులు ఆమెకె చెల్లించుకుంటారు. గట్టమ్మ దర్శనం లేకుంటే జాతర అసంపూర్తిగానే ముగిసినట్లు భావిస్తారు. సమ్మక్క తల్లికి అంగరక్షకురాలిగా ఉన్న గట్టమ్మ మేడారం పొలిమేరలో ఉండి మేడారం రక్షణకు కాకతీయ రాజులతో వీరోచితంగా యుద్ధం చేశారు. కాకతీయ సేనలను గడగడలాడించిన గట్టమ్మ చివరకు వీర మరణం పొందారు. దీంతో సమ్మక్క-సారలమ్మల దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరు తొలుత గట్టమ్మ తల్లిని దర్శనం చేసుకొని మొక్కలు చెల్లించుకుంటారు.




# వరంగల్‌కు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

**విజయవంతంగా శిక్షణ పూర్తి చేయాలి**

**సీపీ అంబర్ కిషోర్ ఝూ**



**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కీర్తి ప్రతిష్టలు తీసుకవచ్చే రీతిలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ట్రైనీ కానిస్టేబుళ్ళకు సూచించారు. పోలీస్ కానిస్టేబుళ్ళ నియామకంలో భాగంగా స్టయిఫండరీ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ళగా ఎంపికై తొమ్మిది నెలల శిక్షణకు వెలుతున్న ట్రైనీ కానిస్టేబుళ్లతో వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుళ్ళ నియామాకాల్లో మొత్తం 658 అభ్యర్థులు ట్రైనీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఇందులో 291 మంది సివిల్ ట్రైనీ కానిస్టేబుల్లు, 181 మంది ఆర్మ్డ్ రిజర్వ్ ట్రైనీ కానిస్టేబుల్లు మొత్తం 472 మంది పురుషులు ఎంపికయ్యారన్నారు. అదే విధంగా 141 మంది మహిళలు సివిల్ ట్రైనీ కానిస్టేబుళ్ళు, 45 మంది మహిళా ఆర్మ్డ్ రిజర్వ్ ట్రైనీ కానిస్టేబుళ్ళు మొత్తం 196 మంది మహిళా ట్రైనీ కానిస్టేబుళు ళ ఎంపికయ్యారని వివరించారు. వీరందరికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీతో పాటు, పీటీసీ అంబర్ పేట, మేడ్చల్ పీటీసీ, యూసుఫ్‌గూడ బెటాలియన్ లో తొమ్మిది నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నేటి పరిస్థితులకు తగ్గట్లుగా ప్రజలకు సేవలందించే రీతిలో ట్రైనీ కానిస్టేబుళ్ళకు శిక్షణ సమయంలో మానసికంగా, శారీరకంగా, అలాగే వివిధ అంశాలపై అవగాహన కల్పించే తరహాలో శిక్షణ అందజేయబడుతుందన్నారు. మీరు ఎలాంటి పరిస్థితులోన్కైనా విజయంగా సాధించే తరహాలో శిక్షణ అందించబడుతుందని, మీరూ పొందే శిక్షణతో మీరు పదవీ విరమణ పోందే వరకు ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కోనే పోలీస్ అధికారిగా రూపాంతరం చెందుతారని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం శిక్షణకు తరలివెళ్తున్న ట్రైనీ కానిస్టేబుళ్ళకు అందిస్తున్న కిట్ ఆర్టికల్స్ పోలీస్ కమిషనర్ అధికారులతో కల్సి పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఏసీపీ అనంతయ్య, ఆర్.ఐలు స్పర్జన్, శ్రీధర్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

**ఘనంగా జయంతి వేడుకలు**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ అని పలువురు కొనియాడారు. సోమవారం అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని కరీమాబాద్ సుభాష్ సెంటర్ లో ఆరె కటిక పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోగికార్ రవీందర్ ఆధ్వర్యంలో శివాజి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ దేశభక్తితోపాటు స్త్రీలను మాతృమూర్తితో సమానంగా గౌరవించే ఛత్రపతి యువతకు ఆదర్శనీయుడన్నారు. శివాజీ హిందువుల ఐక్యతకు ఎంతగానో కృషి చేశారన్నారు. అగల్ దిటి గణేశ్ ఛత్రపతి శివాజీ వేసి కరీమాబాద్ లో నిర్వహించిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురికి పండ్లు, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో నామతబాద్ కిషన్, రవి, శివాజీ, అజయ్, టింగిలికార్ సతీష్, టింగిలికార్ సురేశ్, రాజేష్, సందీప్, విజయ్, రంజిత్, సంతోష్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బండారు దత్తాత్రేయను కలిసిన రావు పద్మ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను సోమవారం బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చండీగఢ్ లోని రాజ్ భవన్ కు చేరుకున్న ఆమె దత్తాత్రేయకు భద్రకాళీ అమ్మవారి దర్శనానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురలీధర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందం, జిల్లా కార్యదర్శి మాచర్ల కుమార్ స్వామి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## బీజేపీ నేషనల్ కన్వెన్షన్‌కు రవికుమార్..

దేశ రాజధాని ఢిల్లీలో జరగుతున్న భారతీయ జనతా పార్టీ నేషనల్ కన్వెన్షన్ సమావేశంలో పాల్గొనేందుకు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట




రవికుమార్ తరలి వెళ్లారు. కన్వెన్షన్ లో పాల్గొనేందుకు తన పేరును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు బీజేపీ సిద్ధాంతాలతో కూడిన సమాచారాన్ని ఆయనకు అందించారు.

## స్వచ్ఛ మేడారం కరపత్రం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినియోగదారుల సమాచార కేంద్రం, హసన్ పర్తి చైర్మన్ అనుమాండ్ల విద్యాసాగర్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు చేతుల మీదుగా సుబేదారి క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛ మేడారం కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ మేడారం జాతరను పర్యావరణహితంగా జరుపుకోవాలని, ఇది మన అందరి బాధ్యత అని తెలియజేశారు. ప్లాస్టిక్ వస్తువులను కవర్లను జాతరలో ఉపయోగించరాదని, వాటిని ఉపయోగించడం వల్ల అడవి కాలుష్యం అవుతుందని, వన్యప్రాణులకు హాని జరుగుతుందని కావున భక్తులు జాతరకు వెళ్లేటప్పుడు చేతి సంచి, స్టీల్ వాటర్ బాటిల్ వెంట తీసుకొని వెళ్లాలని తెలియజేశారు. కోట్ల మంది భక్తులు సందర్శించే మేడారం జాతరను పరిశుభ్రంగా ఉంచడం, పర్యావరణహితంగా ఉంచడం ప్రభుత్వం ఎంతమంది సిబ్బందిని నియమించిన సాధ్యం కాదని, పరిసరాల పరిశుభ్రతను ప్రజలు స్వచ్ఛందంగా పాటించినప్పుడే అది సాధ్యమవుతుందని చెప్పారు. పేపర్ ప్లేట్స్, ప్లాస్టిక్ గ్లాసులు వాడొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, పర్యావరణ ప్రేమికులు ఇట్యాల సతీష్ కుమార్, జనగాని ప్రశాంత్, తిరుపతి, వెంకటేశ్వర్లు, వినియోగదారుల సమాచార కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

## సమయ పాలన పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సమయ పాలన పాటించని సంక్షేమ హాస్టళ్ల వార్డెన్ల పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల కమిటీ ఆద్వర్యంలో ఏవో నారాయణ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వార్డెన్లు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తూ హాజరు కాకున్న అంటెడెన్స్ వేసుకుంటున్నారని తెలిపారు. చాలా హాస్టళ్లలో సరిగ్గా మెనూ చార్ట్ కూడా లేదన్నారు. వీరికి జిల్లా అధికారులు అండదండాలతో ఉండడంలతో రెచ్చిపోతున్నారని అన్నారు. మండలంలోని హాస్టల్ లో ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించడం లేదని అన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తక్షణమే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మండల ఉపాధ్యక్షుడు సమంత్, నాయకులు చరణ్, మహేష్, సోని, మహేష్ పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** ఆరెపల్లి కి చెందిన తిప్పారపు శ్రీకాంత్ కాలు నొప్పితో బాధ పడుతుండగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు, ప్రజా సేవకులు అల్లం బాలకిషోర్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి, గీసుకొండ మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, గీసుగొండ ఎంపీపీ భీమగాని సౌజన్య, జిల్లా నాయకులు సాయిలి ప్రభాకర్, కొమ్ము శ్రీకాంత్, మాదాసి రాంబాబు, మహేందర్, వెంకటేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, బాబురావు, రాజిరెడ్డి, శివాజీ, రాజేందర్ పాల్గొన్నారు.

# గురుకుల పోస్టుల భర్తీలో అభ్యర్థులకు అన్యాయం

## కలెక్టరేట్‌లో పీడీఎస్‌యూ వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పోస్టుల భర్తీలో అభ్యర్థులకు అన్యాయం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహ రావు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని కలెక్టరేట్ కార్యాలయం సూపరింటెండెంట్ పి. కృష్ణమూర్తికి పీడీఎస్ యూ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ గత పదేళ్లు నిరుద్యోగుల బతుకులతో చెలగాటం ఆడిన కేసీఆర్ సర్కారుకు రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగులు తగిన బుద్ధి చెప్పి సాగనంపారు. ప్రజల ఆకాంక్షలు కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని విశ్వసించి అధికారం అప్పచెప్పారు. కానీ, గురుకుల బోర్డు అసంబద్ధ నిర్ణయాలతో వేలాదిమంది నిరుద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ నియామకాలలో గురుకుల బోర్డు అన్యాయమైన, వివాదాస్పద నిర్ణయాలతో అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా గురుకుల ఉపాధ్యాయ నియామకాలలో మొదటగా పైస్థాయి ఉద్యోగాల (డీఎల్, జేఎల్) తర్వాత కింది స్థాయి ఉద్యోగాలు (పీజీటీ, టీజీటీ) భర్తీ చేయాలి. కానీ, ప్రస్తుతం అన్ని పోస్టులను ఇష్టారీతిన ఒకేసారి నియామకాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఒకే వ్యక్తి ఒకటి కన్నా ఎక్కువ ఉద్యోగాలలో ఎంపిక అవ్వడం జరుగుతుంది. కొందరు అభ్యర్థులైతే నాలుగు చొప్పున ఎంపికవుతున్నారు. మెజారిటీ పోస్టులకు ఇలాగే జరుగుతుంది. ఒక్కో అభ్యర్థి 2, 3 పోస్టుల చొప్పున ఎంపిక కావడం వల్ల, మెరిట్ తర్వాత ఉన్న వారికి అవకాశం లేకుండా పోతుంది. ఎక్కువ ఉద్యోగాలు వచ్చిన వ్యక్తి ఒక ఉద్యోగాన్ని తీసుకుని, మిగతా వాటిని వదిలేసి వెళ్లడం, ఆ ఉద్యోగాలు అలాగే ఖాళీగా ఉండిపోవడం జరుగుతుంది. ఈ విధంగా దాదాపు 3000 నుంచి 3500 ఉద్యోగాలు బ్యాక్ లాగ్ పోస్టులుగా మిగిలిపోయే పరిస్థితి ఉంది. ఇలా వేల సంఖ్యలో పోస్టులు మిగిలిపోవడం వల్ల, మెరిట్ ఉండి కూడా ఉద్యోగం పొందలేక నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతారు. కాబట్టి టీఎస్పీఎస్సీ జేఎల్, గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, పీడీ, పీఈటీ, లైబ్రేరియన్ పోస్టుల నియామకాలు వరుస క్రమంలో జరిపి వేలాది ప్రతిభ, అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేసి, వారి కుటుంబాల్లో సంతోషం నింపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా నాయకులు అశోక్, ప్రవీణ్, వినయ్, అరుణ్, రామరాజు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ భవన్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

### హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 8వ డివిజన్ లో బుద్ధ భవన్ పునర్నిర్మాణానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మి, వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ స్వామి చరణ్, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, నాయకులు నలుబోల సతీష్, సీనియర్ జర్నలిస్ట్ బీఆర్ లెనిన్, గోకారపు శ్యాం, బాబా ఖాదర్ అలీ, దండ్రే రమేష్, డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, గుత్తికొండ సురేందర్, మోహన్ విజయ్, రాము, రాకేశ్ లక్ష్మినారాయణ, అనిత మున్సిపల్ కార్పొరేషన్ ఎఈ, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టువస్త్రాలు అందజేత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి సీతక్క, ఐటాడీఏ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి అంకిత్ మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని గ్రామం పునుగొడులోని గోవిందరాజుల గుడిని సందర్శించి పూజారులు, గోవిందరాజుల వంశస్తులు 30 కుటుంబాలకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఐటీడీఏ ఏటూరునాగారం తరుపున రెండు డోలీలు బహూకరించారు. అలాగే గ్రామంలోని దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని సీతక్క హామీ ఇచ్చారు. గుడికి కావలసిన వాటర్ సప్లై, బాత్రూమ్స్ కావాలని ఆమెను కోరగా అంచాన వేయించిపనులు త్వరగా పూర్తి చేయాలని ములుగు కలెక్టర్, అధికారులకు సీతక్క ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా దేవాలయానికి ఆర్చి, మంచి నీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తుల కోరిక మేరకు వారికి సీతక్క హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ లచ్చు పటేల్, ఐటీడీఏ ఏటీడబ్ల్యూఓ ఎర్రయ్య పాల్గొన్నారు.

# పరకాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరాను

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పదవుల కోసం కాదు, పరకాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. సోమవారం పరకాల పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ పరకాల అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని, పదవుల కోసం పార్టీలో చేరలేదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాల నియోజకవర్గ ఆస్తులను కొల్లగొట్టాడని, అతడిని ఓడించడమే లక్ష్యంగా బీజేపీలో పనిచేశానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో గతం నుంచి పనిచేసిన నాయకులకు గుర్తింపు ఉంటుందని, పాత నాయకులు నావల్ల ఏమాత్రం బాధపడకుండా చూసుకుంటానని అన్నారు. రాబోయే పరకాల మున్సిపల్ ఎన్నికల్లో 22 సీట్లకు 22 గెలిచే విధంగా కృషి చేస్తానని, ఎంపీ ఎన్నికలలో ఎవరిని నిలపెట్టిన గెలిపించుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్న అంటే నేనున్నానని ఆపదలో ఆదుకునే నాయకుడు, పరకాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కాంగ్రెస్ పార్టీలో చేరడం స్వాగతిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజారి సాంబయ్య, ఈర్ల చిన్ని, రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి చేరడం సంతోషంగా ఉందని ఆయన సేవలను కాంగ్రెస్ పార్టీ వాడుకుంటుందన్నారు. పరకాల కౌన్సిలర్ పంచగిరి జయమ్మతో పాటు మాజీ ఎంపీపీలు ఒంటేరు రామ్మూర్తి, పావుశెట్టి సుకన్య , లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, మాజీ పీఏసీ చైర్మన్ పూజారి సాంబయ్య, కాంగ్రెస్ సేవాదల్ సభ్యుడు బొచ్చు చెందర్, చిన్నాల గోనాథ్, పరకాల పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్, సుర సతీష్, ప్రధాన కార్యదర్శిలు చందుపట్ల రాజిరెడ్డి, పబ్బా శ్రీనివాస్, బొమ్మగంటి చంద్రమౌళి, బొచ్చు బాబు, లక్కం వసంత, పసుల జయ, చర్లపెల్లి మాజీ సర్పంచ్ చాడ రవీందర్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు, నడికూడ మండల కమిటీ సభ్యులు, పరకాల మండల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంగారు ఆభరణాలలో కల్తీ



## జాగ్రత్తలపై అవగాహన అవసరం

**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** నగరంలోని బాలసముద్రం చిల్డ్రన్స్ పార్క్ లో డిస్ట్రిక్ కన్స్యూమర్ అధ్యక్షుడు త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన సోమవారం వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రతునిధులకు వినియోగదారుల రక్షణ చట్టం 2019లోని హక్కులు బాధ్యతలపై శిక్షణ శిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ వినియోగదారులు ముఖ్యంగా మహిళా వినియొగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు మోసాలపై వివరించారు. అతి ఖరీదైనా బంగారు ,వెండి ఆభారణాల లో ప్రాణంతక వ్యాధికారకలైన కొన్ని దాతువులను బంగారు ఆభారణాలలో కల్తీ చేస్తున్న విషయమై జాగ్రత్త వహించాలని తెలిపారు. భారత ప్రమాణాల సంస్థ బీఐఎస్ వారు నిషేధించిన కాడ్మియం, ఇరీడియం, రుతూనియం లను వివిధ బడా కంపెనీల బంగారు వెండి ఆభారణాలలో కలుపుతున్నారని ఆరోపించారు. వాటి ద్వారా దీర్ఘకాలిక చర్మవ్యాధులు , థైరాయిడ్, క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందన్నారు. ఇలాంటి మోసాలని అరికట్టాలంటే ప్రతి కొనుగోలుపై అధీకృత రశీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. రశీదు తీసుకోవడం బాధ్యత అని అందుకే భారత ప్రభుత్వం "మేరా బిల్- మేరా అధికార్ " అనే వినియోగదారు మేలుకొలుపు నినాదాన్ని ప్రవేశపెట్టి అధిక రశీదులు పొందినవారికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తుందని దాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల మహిళా ప్రతినిధులు ఇందిరా,కళావతి, విజయ, రోజా శ్యామల, సునీత, మంజుల, మాధవి, రాజేశ్వరి, చంద్రకళ, రజిత, శాంతి, వినియోగ ప్రతినిధులు రాజేందర్, గణేష్, వెంకటేష్, సదానందం, చిరంజీవి పాల్గొన్నారు.

## వాటర్ ప్యూరిఫై బహూకరణ



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా వారు విర్బ్యాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈఆర్ ఆక్టివిటీ యాక్టివిటీలో భాగంగా రూ.60 వేల విలువ చేసే తాగునీటి యంత్రం (ఆర్ఓ వాటర్ ప్యూరిఫై)ని భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బహూకరించడం జరిగింది. ఈయంత్రాన్ని విద్యార్థులు పరిరక్షించుకొని వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.ప్రభాకర్ యాజమాన్యం తదితరులు కంపెనీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ వి.మహేష్, ప్రతినిధులు కె.రాజ్ కమల్, కె.ప్రణయ్ తదితరులు పాల్గోన్నారు.

## అధికారులను కలిసిన బీజేపీ శ్రేణులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో సోమవారం తొర్రూరు పట్టణానికి బదిలీపై విచ్చేసిన ప్రభుత్వ అధికారులను కలిసి పుష్పగుచ్చం ఇచ్చి, శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో తొర్రూరు ఎస్సైగా సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలను పొందిన వీపూరి సురేష్ నేడు డీఎస్పీగా రావడం సంతోషకరమని, వారిని కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. తొర్రూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా విచ్చేసిన టి.సంజీవ్ ని పోలీసు స్టేషన్ లో కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో నూతన కమిషనర్ గా విచ్చేసిన శాంతి కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా అధికార ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా, మండల నాయకులు మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్, గడల శేఖర్, రాయపురం రాజకుమార్, గంధం రాజు, పప్పుశెట్టి సంతోష్, సీహెచ్ విజయ్ కుమార్, శ్రీనివాస్ చారి, కుమ్మరికుంట్ల శివ, రాజ్ కుమార్, నాగేష్ నాయక్, నడిగడ్డ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చే దిశగా పని చేయండి

### బీజేపీ జిల్లా నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ప్రజా పాలన పేరుతో పరిపాలన కొనసాగిస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులను పంపిణీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఇస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని రేండేళ్లుగా రేషన్ షాపుల ద్వారా అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కోటా కింద ఇవ్వాల్సిన ఒక గింజ బియ్యం గానీ, ఇతర సరుకులు గాని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని విమర్శించారు. కానీ, రేషన్ షాపుల ముందు ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దురదృష్టకరమని బీజేపీ జిల్లా నేత కుందూరు మహేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయంగా పేద ప్రజలకు నెలనెలా ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వ ఉచిత బియ్యాన్ని, లేదా ఒక రూపాయికి కిలో బియ్యాన్ని అమలు చేసి పేద ప్రజల కడుపు నిండే విధంగా పనిచేయాలన్నారు. లేదంటే చేయని పనులకు ప్రచారాలు చేసుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

## వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐనవోలు మండలం, నర్సింహులగూడెం గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో 60 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి ల ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని, ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బిపి. షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని, ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.టి.మదన్ మోహన్ రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, జి. ఉపేందర్, సతీష్ బాబు, నరసింహ చారి, రాజు, గ్రామస్తులు, వృద్దులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనకు తీర్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సు బొడ్రాయి పునఃప్రతిష్ఠ స్థాపన చేయాలని ఉర్సు గ్రామ పెద్దలు నిర్ణయించారు. వేదపండితులు వెలిదె యుగేందర్ శర్మ, వెలిదె అనంతమూర్తి శర్మనిర్ణయించిన ముహూర్తం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఉర్సు గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, కాలనీ కమిటీలు అందరూ సమన్వయం, సహకారంతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. శ్రీ శివాంజనేయ స్వామి ఆలయం మహా కుంభాభిషేకం నిర్వహించాలని తీర్మానం చేశారు. ఆదివారం ఉదయం శ్రీ శివాంజనేయ స్వామి ఆలయం ధర్మశాలలో గ్రామ పెద్దలు, కుల సంఘాలు, యువకులు సమావేశమయ్యారు. ఉర్సు బొడ్రాయి పునఃప్రతిష్ఠ స్థాపన తదితర అంశాలపై అభిప్రాయాలు సేకరించారు. అందరి ఆమోదంతో కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రసంగించారు. గ్రామ ప్రజలందరి భాగస్వామ్యంతో బొడ్రాయి పునఃప్రతిష్ఠ స్థాపన చేయాలని సూచించారు. వచ్చే మార్చి 3న ఆదివారం ఉదయం 10:00 గంటలకు సమావేశం ఉంటుందని, ఉర్సు చిన్న మహంకాళి ఆలయంలో గ్రామ ప్రజలు సమావేశం కావాలని నిర్ణయించారు. సమావేశంలో వేదపండితుల వెలిదె యుగేందర్ శర్మ, వెలిదె అనంతమూర్తి శర్మ, గ్రామ పెద్దలు, యువతకు, వివిధ కుల సంఘాలు పాల్గొన్నారు.

## మిల్స్ కాలనీ సీఐకి సన్మానం



వరంగల్ వాయిస్, వరంగల్ : ఇటీవల మిల్స్ కాలనీ సీఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన మల్లయ్యకు 42 వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో సీఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన మల్లయ్యను 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ కలిసి శాలువాతో సత్కరించి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఆకతాయిలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో రాత్రిపూట పోలీస్ గస్తీలను పెంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఐ మల్లయ్యను కోరారు. ముత్తినేని రామమూర్తి, ఏలుగు అశోక్ కుమార్, గుండు నవీన్ కుమార్లు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలి

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ని నిషేదించాలని ప్రతి మేడారంకు కాలినడకన ర్యాలీ నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతుంది. ఈ ర్యాలీలో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను, పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మన అందరిదీ అని, మన భవిష్యత్తు ప్రకృతి మీద ఆధార పడి ఉందని, వరంగల్ పార్లమెంట్ అస్పిరేంట్ డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు వరంగల్ జిల్లాలో చొరవ తీసుకుంటురన్నారు.

## మచ్చ లేని నాయకురాలు సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** సీతక్క మీద ఒక్క అవినీతి మచ్చ లేదని, తన పేరుని, కీర్తిని కించపరచడానికి కొందరు దుండగులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వెంకటాపూర్ మండల అధ్యక్షులు మైస ప్రభాకర్ మండిపడ్డారు. సోమవారం ములుగు నియోజకవర్గం వెంకటాపూర్ రామప్ప మండలం పాపయ్యపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ సీతక్క మీద అసత్య ప్రచారాలు, అసత్య ఆరోపణలు చేస్తున్న వారందరూ దమ్ముంటే ఆధారాలు చూపించాలని అన్నారు. కావాలని సీతక్క పేరును దెబ్బ తీయడానికి కొందరు ప్రతి పక్ష నేతల కుట్ర ఇదని ఫైరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ నాయకులు కే సురేష్, గ్రామం కమిటీ ఉపాధ్యక్షుడు మేకల సుధాకర్, ఎస్సీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్ణ సమ్మయ్య, సీనియర్ నాయకులు చెలిమల్ల రాములు, బీసీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు ధరమ్ చోద్ రేఖ, మోతిలాల్, ఈజ్జి గిరి పద్మ, ఐదు మల్లుపార్టీ నాయకులు తుమ్మేటి జయపాల్ రెడ్డి, గొల్ల రాములు, జగినపల్లి పో సెల్లయ్య, పురుషోత్తం, రాజ నరసయ్య, జాన పట్ల దేవేందర్, గుండారపు ఓదెలు, అజ్మీరా మోహన్, రెంటాల శంకర్, బోడ సతీష్, మైస సతీష్, నరసయ్య, రెంటాల సదయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** డీఎస్సీ 2008లో సెలెక్ట్ నష్టపోయిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలనిహైకోర్టు ఫిబ్రవరి 8న తీర్పు ఇచ్చిందిని, ఆ తీర్పు కాపీని మహబూబాబాద్ లో నష్టపోయిన అభ్యర్థులు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ కు అందించి తమకు త్వరగా ఉద్యోగాలు ఇప్పించేలా ముఖ్యమంత్రికి లెటర్ రాయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా మన కాంగ్రెస్ ప్రభుత్వంలో మీ అందరికీ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు బాబు రెడ్డి, షరీఫ్, ప్రభాకర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు




**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం నూతన ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన భవానీ సేనను సోమవారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ బందల సత్తమ్మ, మైనార్టీ జిల్లా కార్యదర్శి జాని సీనియర్ నాయకులు మాచర్ల సారయ్య, లేతకారి రాజబాబు, ఎస్సీ సెల్ మండల పార్టీ అధ్యక్షుడు, మహాదేవపూర్ మాజీ వార్డు సభ్యురాలు లేతకారి కవిత, మహిళ గ్రామ శాఖ అధ్యక్షుడు, ప్రచార కమిటీ కన్వీనర్ షకీల్, గ్రామశాఖ ఉపాధ్యక్షులు తాజోద్దీన్, యూత్ నాయకులు హైదర్, శేఖర్ , సంతోష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వద్దిరాజు రవిచంద్రను సత్కరించిన ఎర్రబెల్లి



**వరంగల్ వాయిస్,హైదరాబాద్ :** ఎంపీ రవిచంద్ర రాజ్యసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారు కావడం పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి హర్షం వ్యక్తం చేస్తూ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ రవిచంద్రను దయాకర్ రావు శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. తన అభ్యర్థిత్వం ఖరారు కావడానికి సహకారం అందించిన ఎర్రబెల్లి దయాకర్ రావుకు రవిచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

## క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, స్పోర్ట్స్ :** ఈ నెల 25 నుంచి రాము స్మారక క్రికెట్ టోర్నమెంట్ జరగనున్న తరుణంలో ఆ పోటీలకు సంబంధించిన పోస్టర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం స్మార్ట్ ఫోన్ లకు అలవాటు పడి శారీరక శ్రమలేఖ తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, ఇలాంటి క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించి తమ క్రీడా ప్రతిభతో పలు విజయాలను జిల్లాకు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా క్రికెట్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభాను రావు మాట్లాడుతూ మంత్రి డాక్టర్ తక్కళ్లపల్లి పురుషోత్తమ రావు ప్రధమ పుత్రుడైన రాము తెలంగాణ జన వేదిక పేరుతో పలు సమావేశాలు నిర్వహించడంతో పాటు పలు సామాజిక కార్యక్రమాలలో తన వంతు కృషి చేసినట్లు ఉదయభాను రావు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలు హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో విజేత జట్టుకు రూ.50 వేల నగదు, అలాగే రన్నరప్ జట్టుకు రూ.30 వేల నగదును బహుమతితో పాటు ట్రోఫీలను అందజేయనున్నట్లు ఈ పోటీల కోఆర్డినేటర్ బండారి ప్రభాకర్ తెలిపారు. ఈ టోర్నమెంట్ పాల్గొనబోయే క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.2001లు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన జట్లు బండారి ప్రభాకర్ 9550131927, మట్టెడ కుమార్ 9985338283, మహమ్మద్ అబ్బల్ 9010002889, ఎర్ర సుమన్ 9676568862 ఈ ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## సివిల్ కానిస్టేబుల్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, సంగెం :** మండల కేంద్రంలో సోమవారం రావుల లహరి సివిల్ కానిస్టేబుల్ ను పూల బోకే అందించి శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ మాట్లాడుతూ కందగట్ల కళావతి నరహరి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, దానికి నిలువెత్తు నిదర్శనం రావుల లహరి నరేష్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, సెర్ప్ సీసీ, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ బొజ్జ సురేశ్, పులి రాజశేఖర్, సెర్ప్ వీవోఏలు మేడి విజయ, ఆగపాటి సుమతి, మాంకాల ప్రభాకర్, గ్రామ సంఘం అధ్యక్షురాలు తండా రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ పరకాల అసెంబ్లీ అధ్యక్షుడిగా అమ్మ సాంబయ్య



**వరంగల్ వాయిస్, పరకాల :** బహుజన్ సమాజ్ పార్టీ పరకాల అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా బీసీ కురుమ సామాజిక వర్గానికి చెందిన దామెర మండలం పసరగొండ గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గ నేత అమ్మ సాంబయ్య కురుమను సోమవారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక పట్ల బీఎస్పీ హనుమకొండ జిల్లా జిల్లా అధ్యక్షుడు అమ్మఒడి ఎల్తూరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నడికూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలకంటి రాజు పెద్ద నాన్న ఎలకంటి రాములు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం హఠాత్తుగా మరణించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నడికూడ మండల అధ్యక్షుడు కడివెండి నరేందర్ చారి ఆధ్వర్యంలో మృతుడు రాములు కు నివాళులర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు బెజ్జంకి రాజేందర్ చారి, ప్రధాన కార్యదర్శి బండ్ల రాజు చారి, సహాయ కార్యదర్శి బండ్ల రమేష్ చారి, కార్యవర్గ సభ్యులు క్రిష్ణాది సాంబయ్య చారి, రవీందర్ చారి, కడివెండి భిక్షపతి చారి, రాజు చారి, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కోఆర్డినేటర్‌గా రవీందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ములుగు జిల్లా కోఆర్డినేటర్ గా కొండం రవీందర్ రెడ్డి నియామకమయ్యారు. జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి నియామక పత్రం జారీ చేశారు. తనపై నమ్మకంతో ములుగు జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించినందున జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు, అడ్వైజర్ జల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, ప్రొఫెసర్ డాక్టర్ బానోతు ధర్మానాయక్, సమస్త జనరల్ సెక్రటరీ డా.పబ్బు ధర్మరాజు, జాతీయ కోఆర్డినేటర్ గాదం ఉత్తరయ్య ముదిరాజ్, అడ్వకేట్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ సీనియర్ జర్నలిస్ట్ గాడేపల్లి మధులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## డీపీఆర్వోపై డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ విచారణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారిపై హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా కమిషనర్ విచారణకు ఆదేశించడంతో సోమవారం డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ విచారించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మీడియా అక్రిటిడేషన్ కార్డుల మంజూరు విషయంలో అవకతవకలు జరిగాయని ఈనెల 02న బాల్నే సుమన్ తండ్రి మృత్యుంజయ మహబూబాబాద్ సీనియర్ జర్నలిస్ట్ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కు మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిపై ఫిర్యాదు అందజేయడంతో వెంటనే డిప్యూటీ డైరెక్టర్ తో విచారణకు ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నేడు మహబూబాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో విచారణ చేసి ప్రస్తుతం పని చేస్తున్న డీపీఆర్ఓగా ఉన్న కలువల శ్రీనివాస్ పై చేసిన ఫిర్యాదులన్నీ వాస్తవమేనని సంబంధిత ఆధారాలన్నీ సేకరించి తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

# గొప్ప పాలకుడు ఛత్రపతి శివాజీ

## బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఛత్రపతి 395వ జయంతి సందర్భంగా పరకాల పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ విగ్రహానికి విశ్వహిందూ పరిషత్ పరకాల కన్వీనర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి పూలమాలవేసి జయంతి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి మాట్లాడుతూ ఆయన గొప్పతనాన్ని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 19న ఛత్రపతి శివాజీ ఉత్సవాలు దేశంలో ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు. ఆయనను ప్రతి ఒక్క భారతీయుడు గుర్తు చేసుకుంటే సనాతన హిందూ ధర్మం ఎంత బలిష్టంగా ఉందో తెలుస్తుందన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ మొఘలుల దురాగతాలకు వ్యతిరేకంగా నిలబడి, హిందూ సంప్రదాయాలను పునరుద్ధరించిన గొప్ప పాలకుడు అని కొనియాడారు. అతడు స్వేచ్ఛ కోసం నిలబడటానికి, సహకరించడానికి ఇతరులను కూడా ప్రేరేపించాడు. అతడి విలువలు ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడు నేర్చుకోవాలని, దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చిన శివాజీ లాంటి యోధుడి జీవిత చరిత్ర తెలుసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దేవునూరి మేగ నాథ్, జిల్లా ప్రధనకార్యదర్శి ఆర్పీ జయంత్ లాల్, జిల్లా నాయకులు సిరంగి సతీష్, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, ఉపాధ్యక్షుడు సంగ పురుషోతం, సీనియర్ నాయకులు దంచనాల సత్యనారాణయణ, మాజీ ఉప సర్పంచ్ దండ్ సురేష్, బూత్ అధ్యక్షులు పిట్ట కిషోర్, బోలెద్ల కృపేందర్ రెడ్డి, ఏబీవీపీ నగర కార్యదర్శి వావిలాల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19వ డివిజన్ లో కాశిబుగ్గ ఓసిటీ రోడ్ క్రాస్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి ఉత్సవాలను విజయవంతంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమం సతీష్ కట్టర్ హిందూ, మడిపల్లి నాగరాజు, వంగరి రాంప్రసాద్ ఆధ్వర్యంలో స్వీట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు, సముద్రాల పరమేశ్వర్, సిద్ధం నరేష్, కూచన ఏకాంబరం, పెరుమాండ్ల లక్ష్మణ్, శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా. ఈ కార్యక్రమంలో కోమకుల నాగరాజు, కోట సతీష్, తిరుమల్ శ్రీనాథ్, అల్లి అజయ్, సొల్లేటి రాఘవచారి, గడ్డం భాస్కర్, చింతం జగదీష్, దాసి శివ కృష్ణ, మండల చంద్రశేఖర్, దుస్సా కృష్ణ, కుడికాల కోటేశ్వర్, రాము, రాజేష్, బొమ్మ రవి, గాదె జగన్, సోమ గోపి, గాదె సతీష్, నరసింహ, హిందూ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ధైర్య సాహసాలకు మారుపేరు ఛత్రపతి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ యుద్ధ నైపుణ్యం, పరిపాలన తెలంగాణ రాష్ట్రానికి,దేశానికే ఆదర్శమని , ధైర్య సహసాలకు మారు పేరు ఛత్రపతి అని తెలంగాణ మాజీ ఉపముఖ్యమంత్రి, ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామస్తులతో కలిసి సోమవారం భాజాబజంత్రీలతో పెద్ద ఎత్తున ర్యాలీతో వెళ్లి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ధర్మసాగర్ మండలం దేవునూర్ లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పరిపాలన, యుద్ధ నైపుణ్యంలో అన్నింటా శివాజీ ఆదర్శమని కొనియాడారు. మత సామరస్యాన్ని చాటారు. ప్రజలే ప్రభువులుగా ఆయన పాలన సాగిందన్నారు. శివాజీ ఎన్నో యుద్ధాలు చేసినా హింసను ప్రోత్సహించ లేదు. పవిత్ర స్థలాలు ధ్వంసం చేయలేదని, పౌరులంతా ఛత్రపతి శివాజీ వీరత్వాన్ని అందిపుచ్చుకొని నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలని కడియం శ్రీహరి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, స్థానిక జడ్పీటీసీ, ఎంపీపీ, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆరే సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షులు దుర్నాల రాజు, గౌరవ అధ్యక్షులు పాపారావు శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మోకిడే మహేందర్, మండల నాయకులు రవీందర్, రాజేందర్, రాజేశ్వరరావు, రాజు, శంకర్, సచిన్, శివ, నాగేష్, కొమురయ్య పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎల్బీ నగర్ 21వ డివిజన్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరి కాయలు కొట్టారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకాం హరి శంకర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అపురూప రజనీష్ నేత, వంగరి ప్రదీప్, గోవింద్ సింగ్, చుంచు సత్యం, సురంపెల్లి విజయ్, వల్పదాసు రవీందర్, సాంబమూర్తి, కృష్ణ, రతన్, నవీన్ పాల్గొన్నారు.

## డోర్నకల్‌లో..



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను స్థానిక అశోక్ భవన్ నందు యాదవులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత యాదవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్ యాదవ్, మహబుబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ యాదవ్, జిల్లా యూత్ కన్వీనర్ దాసరి నాని యాదవ్ విచ్చేసి క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా దాసరి నాగేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు విద్యా,వ్యాపార,రాజకీయ రంగంలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల వెంకటేశ్వర్లు, సకినాల వెంకన్న, కొత్త వీరన్న, పచ్చిపాల మల్లేశం, ఎల్లబోయిన లింగస్వామి, పచ్చిపాల గోపి, కోడి యాకయ్య, ఎల్లావుల శివ గణేష్, సకినాల కొమరయ్య, పచ్చిపాల రాంబాబు, నల్లమాద పెంటయ్య, దాసరి నాగేష్,జక్కుల సురేష్, కొత్త నరేందర్, కొత్త రాములు, దాసరి శ్రీకాంత్, పచ్చిపాల నరేష్, కాసు మహేష్, ఎల్లావుల నవీన్ చంద్ర, పచ్చిపాల గోపాల్, కొంగల మురళి, దాసరి మహేష్, మహిళా నాయకురాలు గంట ప్రవీణ యాదవువలు పాల్గొన్నారు.

## తొర్రూరులో..



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** గుర్తురు గ్రామంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా శివాజీ చిత్రపటనికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత గుద్దేటి రమేష్, గంట దశరథం, గందె వంశీ, పిట్టల చింటూ, జంపాల సందీప్, బోయిని ప్రశాంత్, కొత్తూరు రాజేందర్, సందీపు, తదితర యువకులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. భారతదేశం కోసం తన శక్తితో ఎన్నో సుదీర్ఘ యుద్ధ కాలంలో లెక్కలేనన్ని యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. యుద్ధంలో ఓడిపోయిన శత్రువుల రాజ్యంలో ఉన్న యుద్ధం చేయలేని వారికి, స్త్రీలకు, పసివారికి సహాయం చేసిన మానవతావాది ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ప్రజలను హిందు స్వరాజ్యం స్థాపన కోసం నిరంతరం శత్రు దేశాలతో పోరాడిన వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్, అలాంటి ఆయన్ని మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, విభాగ్ కన్వీనర్ అయితే నిఖిల్, జోనల్ ఇంచార్జి శ్రవణ్ పాల్గొన్నారు.

## గోరి కొత్తపల్లి మండలంలో..



**వరంగల్ వాయిస్, గోరికొత్తపల్లి :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం నేటి యువతకు ఆదర్శమని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మటికే సంతోష్, భూపాలపల్లి అరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వంచనగిరీ వీరేశం అన్నారు. నూతన గోరి కొత్తపల్లి మండల కేంద్రంలోని బంగ్లా మసీద్ వద్ద సోమవారం గొరికొత్తపల్లి అరే సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రగుసాల తిరుపతి అధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించగా ముఖ్య అతిథిలుగా ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు మటికే సంతోష్, ఆరే సంక్షేమ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వంచనగిరి వీరేశం పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరే సంక్షేమ సంఘం గోరి కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు ఓన్నాల శివాజీ, ఎంపీటీసీ హమీద్, నాయకులు నిమ్మల రాజు, ఆరే సంక్షేమ సంఘం కుల పెద్ద మనుషులు పకిడే సంతోష్, కరాబు రాజు, దుమాల అంకుస్, రగుసాల వీరన్న, పెర్వాల కిషన్ రావు, ఛత్రపతి శివాజీ మహారాజ్ అభిమాన సంఘం ఉపాధ్యక్షుడు లింగంపల్లి కృష్ణ, బాపెల్లి నరేష్, ఇంగే యుగెందార్, మరిగిద్దే రాజు, శాపతి రాజు, వంచనగిరి రాజు, కుడ్లే నర్సింగం, సుఖినే సంజి, దుమాల కిషన్, రగుసాల మహేందర్, తుమ్మరపెల్లి వేణు, శాపతి వీరన్న, వంచనగిరి శ్రీను, ఇటుకాల లింగారావు, రాజేందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఆమె లేకుండా 'దంగల్' అసంపూర్ణం

## సుహానీ భట్నాగర్ మృతి

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్'దంగల్' చిత్రంలో నటించి చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు సుహానీ భట్నాగర్. బబితా కుమారిగా ప్రేక్షకులకు చేరువైన ఆమె అరుదైన వ్యాధితో ఇటీవల మృతి చెందారు. దీనిపై తాజాగా ఆమె తల్లి పూజ మీడియాతో మాట్లాడారు. 'మేము సుహానీ వ్యాధి గురించి ఎవరికీ చెప్పలేదు. ఆమెకు ఎంతో సపోర్ట్‌గా ఉండే ఆమిర్ ఖాన్‌కు కూడా దీని గురించి చెప్పలేదు. ఇది కేవలం చర్మ సమస్య అనుకున్నాం. సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించాం. చికిత్స కోసం ఎయిమ్స్‌లో చేర్పించాక.. డెర్మటోమయోసైటిస్ వ్యాధిగా వైద్యులు గుర్తించారు. ఇన్‌ఫెక్షన్ బారిన పడి శ్వాస తీసుకోవడం కష్టంగా మారడంతో ఆమె ప్రాణాలు విడిచింది. సుహానీ చాలా తెలివైన అమ్మాయి. చేసే ప్రతి పనిలో రాణించాలనుకునేది. తను దంగల్ చిత్రం చేయడం వల్ల తల్లిదండ్రులుగా మాకు ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టింది. అందరి తల్లిదండ్రుల్లానే మేము మా అమ్మాయిని చూసి చాలా గర్వపడేవాళ్లం' అని ఆమె కన్నీరుమున్నీరైంది.'సుహానీ ఇకలేదన్న వార్త మా మనసుల్ని తీవ్రంగా కలచివేస్తోంది. ఆమె కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. ఆమె లేకుండా 'దంగల్' అసంపూర్ణం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే.




# మరో హారర్ మూవీ సిద్ధం..

కాలింగ్ బెల్', 'రాక్షసి' వంటి హారర్ థ్రిల్లర్స్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుని తనకంటూ ఓ ప్రత్యేకమైన బ్రాండ్‌ని ఏర్పరుచుకున్న దర్శకుడు పన్నా రాయల్' ఇంటి నెం.13' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. డిఫరెంట్ మిస్టీరియస్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ అవుతోండగా ఈ చిత్రంతో పన్నా రాయల్ హ్యాట్రిక్ కొడతారని చిత్ర యూనిట్ కాన్ఫిడెంట్‌గా చెబుతోంది. రీగల్ ఫిలిం ప్రొడక్షన్స్ పతాకంపై డా. బర్కతుల్లా సమర్పణలో హేసన్ పాషా చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది. డిఫరెంట్‌గా ఉన్న టైటిల్.. అంతే డిఫరెంట్‌గా ఉన్న ఫస్ట్‌లుక్ ఆడియన్స్‌లో సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. మార్చి 1న రిలీజ్ అవుతున్న నేపథ్యంలో ' ఇంటి నెం.13' రిలీజ్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సినిమాకి సంబంధించిన విశేషాలను దర్శకుడు పన్నారాయల్ వివరిస్తూ 'ఇప్పటివరకు తెలుగు ఆడియన్స్ ఎన్నో హారర్ సినిమాలు చూశారు. సినిమాలో ప్రతి పది నిమిషాలకు వచ్చే ట్విస్ట్‌తో ఆడియన్స్ థ్రిల్ అవుతారు. హారర్ జోనర్‌లో 'ఇంటి నెం.13' డెఫినెట్‌గా ఒక కొత్త ట్రెండ్‌ని క్రియేట్ చేస్తుంది. టెక్నికల్ వేల్యూస్ ఈ సినిమాకి పెద్ద ప్లస్‌పాయింట్ అని చెప్పొచ్చన్నారు. ఈ తరహా సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని హాలీవుడ్ టెక్నీషియన్స్‌తో విజువల్ ఎఫెక్ట్స్ చేయించామన్నారు. ఈ సినిమాకి మరో ప్లస్ పాయింట్ వినోద్ యాజమాన్య మ్యూజిక్ అని తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తాడన్నారు.



# రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్..

రామ్ చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఆర్‌సీ 16 వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కథా చర్చలు, మ్యూజిక్ సిటళట్టింగ్స్ పూర్తయ్యాయి. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరు? అని కొద్ది రోజులుగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేరు బయటికొచ్చినా ఎక్కువ వినిపించిన పేరు మాత్రం అతిలోక సుందరి తనయ జాన్వీ కపూర్‌దే. రామ్‌చరణ్‌తో జాన్వీ జోడీ కట్టనుందనే వార్త చాలారోజులుగా హల్‌చల్ చేస్తోంది. ఇప్పుడు అదే నిజమైంది. 'ఆర్‌సీ16' చిత్రంలో రామ్‌చరణ్ సరసన హీరోయిన్ గా జాన్వీకపూర్ నటించనుంది. ఈ విషయాన్ని తన తండ్రి బోనీకపూర్ వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'త్వరలో జాన్వీకపూర్ చరణ్‌తో నటించనున్న చిత్రం త్వరలోనే ప్రారంభం కానుంది' అని స్వయంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు. ఆ షూటింగ్ పూర్తయ్యాక 'ఆర్‌సీ16' ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుందని టాక్ వినిపిస్తోంది. నేటివిటీ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రం తన కెరీర్‌లో అత్యుత్తమ చిత్రం కానుందని గతంలో చరణ్ తెలిపారు. ఇదొక అద్భుతమైన మట్టి చిత్రమని ఆయన వెల్లడించిన సంగతి తెలిసిందే! జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. ఇది ఆమెకు తెలుగులో రెండో సినిమా కానుంది. అయితే జాన్వీ కపూర్ ఈ చిత్రంలో ఖరారైందని బోనీ కపూర్ వెల్లడించినప్పటి నుంచి రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి. జాన్వీని హీరోయిన్ గా తీసుకోవడం పట్ల అభిమానులు నిరాశలో ఉన్నారు. ఆమె గ్లామర్ పాత్రలకు తప్ప నెటివిటీ కథలకు సూట్ కాదని కామెంట్లు చేస్తున్నారు. మరో నెటిజన్ అయితే 'ఆమెను ఎందుకు తీసుకున్నావ్ అన్నా.. ఒక్క హిట్ కూడా లేదు.. మార్చేసేయ్.. జాన్వీ కపూర్ వద్దు బాబోయ్' అని కామెంట్స్ చేశారు.



# జాతరను విజయవంతం చేయాలి

**మేడారం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**మంత్రి సీతక్కతో కలిసి వనదేవతల సందర్శన**



**వరంగల్ వాయిస్, ములుగు :** రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరన విజయవంతం చేద్దామని, భారీ సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో స్థానిక శాసనసభ్యులు, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కనివినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశామన్నారు. ప్రపంచానికి మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాశస్త్యాన్ని తెలియజేయాలన్న లక్ష్యంతో మీడియా సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. సోమవారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా పాత్రికేయుల సౌకర్యార్థం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. జాతర కవరేజ్ నిమిత్తం పాత్రికేయులకు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు అలాగే వైఫై సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే వారికి అల్పాహారం, భోజనాల సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు. 70 రోజుల క్రితం ప్రజల, సమ్మక్క సారలక్క తల్లుల దీవెనలతో తెలంగాణాలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. ఇప్పటి వరకు సుమారు 50 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారన్నారు. ఒక పక్క అసెంబ్లీ నడుస్తున్నా భక్తుల సౌకర్యం కోసం సీతక్క నిత్యం జాతర పనులను పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు చేసిందని కొనియాడారు. అంటే ప్రభుత్వానికి ప్రజల పట్ల, భక్తుల పట్ల ఎంత చిత్త శుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. గత ప్రభుత్వం మేడారం జాతరకు రూ.75 కోట్లు కర్చుపెడితే ఈ ప్రభుత్వం నష్టాలలో ఉన్నా రూ.110 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నెల21 నుంచి 26 వరకు ఘనంగా జాతర నిర్వహిస్తున్నామన్నారు.

### రెండు కోట్ల మంది భక్తులు..

మేడారం జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు తరలి రానున్నట్లు పొంగులేటి ప్రకటించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నీ ఏర్పాట్లు చేసిందన్నారు. గత ప్రభుత్వం మూడు వేల బస్సులు నడిపితే ఈ ప్రభుత్వం ఆరు వేల ప్రత్యేక ఆర్టీసీ బస్సులను జాతరకు నడుపుతోందన్నారు. ఎన్నికల హామీలలో చెప్పిన విధంగా మేడారం జాతరకు వచ్చే మహిళలకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. జీరో టిక్కెట్లుపై ఇప్పటి వరకు 17 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారన్నారు.

### 16వేల మంది అధికారులు..

జాతర నిర్వాహనకు 16 వేల మంది అధికారులు పనిచేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. పారిశు ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ఇందుకు నాలుగు వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించామన్నారు. గత మేడారం జాతరపై అనుభవం ఉన్న ఐదుగురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని వివరించారు. జాతరకు అనుసంధానం అయ్యే సుమారు 270 కిలో మీటర్ల రోడ్లను నూతనంగా నిర్మించామన్నారు.

### ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యం..

ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజల సౌకర్యార్థం మంచి నీరు, టాయ్ లెట్లు వేల సంఖ్యలో ఏర్పాటు చేశామన్నారు. జాతర జరుగు నాలుగు రోజుల్లోనే కనీసం రెండు కోట్ల మందరి భక్తులు తల్లులను దర్శనం చేసుకోనున్నారు. భక్తులు అధికారులకు సహకరించాలని, సంయమనంతో తల్లులను దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో నెరవేరని మీ కోరికలను రాబోయే ఐదు సంవత్సరాలలో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నెరవేర్చుకుందామన్నారు.





### అమ్మవార్ల ఆశీస్సులు..: మంత్రి సీతక్క

కోట్లాదిగా తరలివచ్చే భక్తులపై అమ్మ వార్ల ఆశీస్సులు ఉండాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున భక్తులు దర్శనం కోసం తరలిరావడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారులు రెండు నెలల నుంచి నిరంతరం విధుల్లో ఉండి జాతర ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులు, వీఐపీలు అధికారులకు పోలీసులకు సహకరించాలని సూచించారు. 1996 సంవత్సరం లోనే రాష్ట్ర పండుగగా గుర్తింపు లభించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కుడా గుర్తించాల్సి ఉందన్నారు. ములుగు జిల్లా ప్రజలు సహకరించాలని, అధికారులు జాతర విధుల్లో ఉన్నందున స్థానిక ప్రజా ప్రతినిధిలు జిల్లాలో ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కరించాలని సూచించారు. మేడారం జాతరకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డితో పాటు క్యాబినెట్ మంత్రులందరికి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జాతర పూర్తయిన తర్వాత కర్చులన్నీ ప్రజల ముందు పెడతామన్నారు. మిగిలిన డబ్బులతో మేడారం జాతరకు శాశ్వత ఏర్పాట్లు చేస్తామన్నారు.

అమ్మవార్ల సేవలో ఉన్న అధికారులు, సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ,పీఆర్ కమిషనర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి పేట జాతరకు రండి

**ఎమ్మెల్యే నాగరాజ్‌కు ఆహ్వానం**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** అమ్మవారి పేటలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు రావాల్సిందిగా కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ కు ఆహ్వానం అందించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న అమ్మవారి పేట సమ్మక్క, సారలమ్మ జాతర కమిటీ ఈ ఆహ్వానం పలికారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతర ఆర్గనైజర్ దాసి రామ్ దేవ్, జాతర కోశాధికారి బైరి నాగరాజు, బైరి హరి, ఆవునూరి కుమారస్వామి, ఎ.రామ్మూర్తి, బి.నవీన్, కె.రాజేష్, గోపి, 44వ డివిజన్, ఆర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి అర్హులను తేల్చేపనిలో అధికారులు

**విధి విధానాలు ఖరారు**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఇచ్చిన ఆరు హామీలను నెరవేరుస్తామని చెప్పిన రేవంత్ సర్కార్.. చెప్పిన మాట ప్రకారం ఒక్కోహామీని అమలు చేస్తూ వస్తోంది. ఇటీవలే మరో రెండు పథకాల అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలుపగా.. వాటి అమలుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. అందులో గృహజ్యోతి అమలుకు మార్గదర్శకాలు సిద్ధమయ్యాయి. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకం అమలుకు ముహూర్తం ఖరారైంది. అయితే.. నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వాడినవారికి ఈ పథకం వర్తించదు. ఇప్పటికి ఈ పథకం కోసం 1,09,01,255 దరఖాస్తులు రాగా.. వాటిలో 64,57,891 మంది తెల్లరేషన్ కార్డుదారులున్నారు. గృహజ్యోతి అమలుకు ఏటా.. రూ.4,164.29 కోట్ల ఖర్చు ఉంటుందని రాష్ట్ర ఇంధనశాఖ అంచనా వేసింది. అలాగే పథకానికి ఎవరెవరు అర్హులవుతారో తేల్చే అంశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మార్చి 1వ తేదీ నుంచి గృహజ్యోతి పథకం అమల్లోకి రానుండగా.. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సరఫరా పథకం అమలు విషయంలో కొన్ని షరతులు వర్తిస్తాయి. గత ఆర్థిక సంవత్సరం 2022-23 నెలకు సగటున వాడిన విద్యుత్ కు అదనంగా 10 శాతం విద్యుత్ ను మాత్రమే గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయనుంది. 2022-23లో నెలకు సగటున 200 యూనిట్లకు మించి విద్యుత్ ను వాడినట్లైతే ఈ పథకం వర్తించదు. లబ్ధిదారుడి రేషన్ కార్డు ఆధార్ తో అనుసంధానమై ఉండాలి. విద్యుత్ బిల్లుల బకాయిలు ఉండకూడదు. నెలకు 101 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ను పొందుతున్న ఎస్సీ, ఎస్టీలకు కూడా గృహజ్యోతి వర్తిస్తుంది. 64,57,891 తెల్లరేషన్ కార్డుదారుల్లో.. 34,59,585 మంది దరఖాస్తుదారులు మాత్రమే గృహ విద్యుత్ కనెక్షన్ ను కలిగి ఉంటారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com